11న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని సాంఘింక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వీటీజీ సీఈటీ-2024 ద్వారా నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరానికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వరలక్ష్మి తెలిపారు. ఈనెల 11న ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్, ఏమైన కరెక్షన్స్ (కులం, పుట్టిన తేదీ, చిరునామా, పేరు తప్పుగా రావడం) ఉంటే సంబంధిత ధ్రువపత్రాన్ని పరీక్ష కేంద్రానికి వెంట తీసుకురావాలని సూచించారు. మెరిట్ ఆధారంగా గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు లభిస్తాయన్నారు.

బాక్సింగ్‌లో జూపల్లి అనుగ్రహకు సిల్వర్ మెడల్



మల్లాపూర్: నాచారం రాంరెడ్డినగర్‌కు చెందిన జూపల్లి రమేష్‌కుమార్ కూతురు జూపల్లి అనుగ్రహ కర్ణాటకలో జరిగిన అండర్-14 సబ్ జూనియర్స్ లెవల్ బాక్సింగ్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించింది. కర్ణాటక ఒలంపిక్ ఇన్‌చార్జి గోవిందా రాజు చేతులమీదుగా మెడల్ అందుకుంది. గతంలో కూడా రాష్ట్రస్థాయిలో పలు మెడల్స్‌ను ఆమె కైవసం చేసుకుంది. ప్రస్తుతం ఆమె నాచారం బాబానగర్‌లో సెయింట్ ఏంజిల్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. బాక్సింగ్‌లోనే కాకుండా చదువులోనూ రాణిస్తోంది.

కీసర మెరవాలి.. భక్తులు మురవాలి..

దైవ దర్శనంలో సామాన్య ప్రజలకు పెద్దపీట



- భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలి
- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం
- సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి. ఆన్‌లైన్‌లో టిక్కెట్ల ద్వారా రామలింగేశ్వరస్వామి దర్శన సౌకర్యం, మహాశివరాత్రిని పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని కీసరగుట్ట(కేసరగిరి) శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 6 నుంచి 11 వరకు జరుగుతాయని, 8న మహాశివరాత్రి సందర్భంగా జాతర ఉంటుందని ఆయన తెలిపారు.

◆ భక్తుల దైవదర్శనానికి ఆరు క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో మూడు క్యూ లైన్లను సామాన్య భక్తులకు కేటాయిస్తున్నామన్నారు. సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. శీఘ్ర దర్శనం, అభిషేకం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులకు తాగునీటితో సహా నిత్యావసరాలు కావాల్సిన వాటిని కూడా సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులకు ఆయన సూచించారు.

◆ జాతరలో 24 గంటలు పారిశుద్ధ్య కార్మికులతో దేవాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్ స్థలంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపారు. స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి అవసరమైన చోట మరుగుదొడ్లకు మరమ్మతులు, లేని చోట తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు.

◆ నిరంతరం విద్యుత్ సరఫరా చేసి, రహదారి వెంట విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. కొలను దగ్గర గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. 24 గంటల పాటు అంబులెన్సులతో కూడిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

◆ భక్తుల సౌకర్యార్థం అన్ని ప్రాంతాల నుంచి బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా వైజంక్షన్ నుంచి దేవాలయం వరకు ఆటోలు, షెటిల్ బస్సులను ఉంచాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికక్కడే సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు.

◆ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖ వారు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో సమీకృత కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షించాలని పోలీసు శాఖకు సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో అగ్ని మాపక సిబ్బంది, ఫైర్ ఇంజిన్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓ రాజేష్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ తాటకం నాగలింగం, ఆలయ ఈఓ సరేంద్ర, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మండలంలోని పూడూర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ శేఖర్‌రెడ్డి తెలిపారు. పూడూర్ గ్రామంలో, గ్రామంలోని వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

డేటా సైన్స్ రంగంలో ఉత్సాహం నిబద్ధత అవసరం



అనురాగ్ హ్యాకథాన్‌లో విద్యార్థులతో అతిథులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో డేటా సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం 24 గంటల హ్యాకథాన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ డేటా సైన్స్ రంగంలో ఉత్సాహం నిబద్ధత అవసరమని అన్నారు. ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధికి యూనివర్సిటీలో అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. గౌరవ అతిథి పంకజ్ ముతే మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన డేటా సైంటిస్టులుగా మారాలంటే అనుభవం ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. పలు కళాశాలల నుంచి హాజరైన 250 విద్యార్థులను 78 బృందాలుగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డేటా సైన్స్ విభాగాధిపతి శ్రీదేవి, యూనివర్సిటీ డీన్ విష్ణుమూర్తి, సుధీర్‌రెడ్డి, రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, యూనివర్సిటీ డైరెక్టర్ అనురాగ్ పల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

అనురాగ్ యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలి



అనురాగ్ యూనివర్సిటీ గేటు ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్: విద్యార్థులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యులు అంకం శ్యామ్‌కిరణ్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యార్థుల వేధింపులకు నిరసనగా శుక్రవారం యూనివర్సిటీ గేటు ఎదుట ఏబీవీపీ విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ చైర్మన్ వ్యవస్థను అడ్డం పెట్టుకొని విద్యార్థులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై భౌతికంగా దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అని, దీనికి ప్రభుత్వం తోడ్పాటు అందించడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు నోరు విప్పాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేసి విద్యార్థులకు భరోసా ఇవ్వాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోందన్నారు. ధర్నాలో ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యులు మహేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్, స్టేట్ టెక్నికల్ సెల్ కోకన్వీనర్ సచిన్, ఆదిత్య, అఖిల్, అరవింద్, రఘు, అనిల్, మిథున్, ఆర్య, ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

థైబజార్ దక్కించుకున్న కృష్ణారావు



వేలంలో అత్యధికంగా పాడినవారిని సత్కరించిన చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ ఆఫీసులో చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తైబజార్‌తో పాటు మాంసపు వ్యర్థాల సేకరణకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో ఎస్.కృష్ణారావు అత్యధికంగా రూ.43 లక్షలకు పాడి తైబజార్‌ను దక్కించుకున్నారు. చికెన్, మటన్ వ్యర్థాలను రూ.5.12 లక్షలకు షేక్ చాంద్ పాడుకున్నారు. కృష్ణారావు, షేక్‌చాంద్‌లను చైర్మన్ సత్కరించారు. వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కమిషనర్ జి.రాజేంద్ర కుమార్, కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ గేయ రచయిత అందెశ్రీకి సన్మానం



రచయిత అందెశ్రీని సత్కరిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: 'జయ జయహే తెలంగాణ' గేయ రచయిత అందెశ్రీని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సన్మానించారు. ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో రచయితను కలిసి శుక్రవారం శాలువాతో సత్కరించారు. జయ జయహే తెలంగాణ గేయాన్ని తెలంగాణ రాష్ట్ర గేయంగా ప్రకటించినందుకు అభినందనలు తెలిపారు. ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్, శ్రీశైలం, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్రాలు అందుబాటులో ఉంచుకోండి

కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి సమాచార ధ్రువీకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏఈ సీహెచ్ అర్చన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సిబ్బంది మీ ఇళ్లకు వచ్చిన సమయంలో ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రత కార్డు(రేషన్ కార్డు), ఆధార్‌కార్డు అందుబాటులో ఉంచుకొని సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.

కొనసాగుతున్న స్పోర్ట్స్ మీట్

రామంతాపూర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో సత్యసాయి విద్యా సంస్థల స్పోర్ట్స్ శుక్రవారం కబడ్డీ, ఖోఖో క్రికెట్ క్రీడలు నిర్వహించారు. శనివారం ముగింపు ఉంటుందని ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరై విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తారని కరస్పాండెంట్ వెంకట్ సాయి తెలిపారు.

సత్కారం



మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన బండారం శ్రీకాంత్‌గౌడ్‌ను నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షులు ఊట్కూరి పూర్ణచంద్రగౌడ్, కొత్తసాయిగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేతాజీ యూత్ క్లబ్ సభ్యులు వెంకట్‌గౌడ్, ఊట్కూరి సురేష్‌గౌడ్, కొత్త విజయ్‌గౌడ్, శ్రీమత్‌గౌడ్, రాజుగౌడ్, దంతూరి నరేంధర్‌గౌడ్, సాయి రామ్‌గౌడ్, కాసుల అనిల్‌గౌడ్, రాకేష్ గౌడ్, సందీప్‌గౌడ్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ, ఐకమత్యం

సీఐ గోవర్ధన గిరి



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న, సీఐ గోవర్ధన గిరి, సంస్కృతి విద్యాసంస్థల చైర్మన్ రమణారెడ్డి

ఘట్‌కేసర్: క్రీడల్లో క్రీడాస్ఫూర్తితో పోటీపడి విజయం సాధించాలని సీఐ గోవర్ధన గిరి అన్నారు. కొండాపూర్ సంస్కృతి పాలిటెక్నిక్ కళాశాల వార్షిక స్పోర్ట్స్ మీట్ సంకల్ప్-2024ను సంస్కృతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డితో కలిసి శుక్రవారం క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటమిని సమానంగా స్వీకరించాలని, క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం అలవడుతుందన్నారు. అనంతరం క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. క్రీడాకారులు స్పోర్ట్స్ మీట్‌లో ఫెయిర్ ప్లే, క్రీడాస్ఫూర్తి నిలబెట్టుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాజేంద్రకృష్ణ, ఎస్సై ఆశోక్, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఉదయ్ కిరణ్, ఫార్మసీ ప్రిన్సిపల్ శిరీష, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శివకేశవారెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మోహన్, పీడీలు సైదులు, సరిత, క్రీడాకారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఫస్ట్ లెవెల్ చెకింగ్ పరిశీలన



ప్రతినిధులను ఎన్నికల పరిశీలకులు కలిసి తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాబోయే పార్లమెంటరీ ఎన్నికల నిర్వహణలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను రాష్ట్ర అదనపు ఎలక్ట్రోరల్ ఆఫీసర్ లోకేష్ కుమార్, జిల్లా కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. అనంతరం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర ఎన్నికల పరిశీలకులు నవీన్ దుద్ది, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్‌లో చేపట్టిన ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈవీఎం, వీవీ ప్యాట్, బ్యాలెట్ బాక్స్‌ల పనితీరును ఈసీఐఎల్ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా పలు రాజకీయ పార్టీల

మల్లారెడ్డి యూనివర్సిటీలో ఏబీవీపీ ఆందోళన



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఇటీవల బాలికల హాస్టల్‌లో ఆహారంలో పురుగులు రావడంతో సమస్య పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని, గర్ల్స్ హాస్టల్‌లో మహిళా సెక్యూరిటీలు మాత్రమే ఉండాలని నినాదాలు చేస్తూ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ధర్నా చేయగా పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వారిని సముదాయించారు. మరోమారు సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు యాజమాన్యం తెలపడంతో ఆందోళన విరమించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



శివకుమార్ (ఫైల్)



గోపి(ఫైల్)

జవహర్‌నగర్: వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దమ్మాయిగూడలో నివసించే ఆగుళ్ల శివకుమార్(33) ఈ నెల 7వ తేదీన ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. చైతన్యపురిలో ఉండే అతడి స్నేహితుడుతో కలిసి ఎక్కడికో వెళ్లినట్లు తల్లి పద్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

కౌకూర్‌లో నివసించే త్రిపాటి గోపి(55), భార్య అరుణ, ఒక కుమారుడు, కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నారు. గోపికి మానసిక స్థితి బాగాలేదు. అదేవిధంగా సంవత్సరం క్రితం కిందపడటంతో కాలికి గాయమై ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 8వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్నెళ్లకు ఒకసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కుషాయిగూడ: ప్రతి ఆరు నెలలకు ఒకసారైనా ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. చర్లపల్లి ఈసీనగర్‌లో శుక్రవారం అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. స్పర్శ హాట్ సైన్స్ ఎన్జీవో ప్రతినిధి శారద లింగరాజు, స్థానిక నేతలు అనుముల నర్సింహారెడ్డి, సత్తిరెడ్డి, అభయ ప్రతినిధులు సుచిత్రరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ పనులు పర్యవేక్షిస్తున్న, చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 11వ వార్డు టీచర్స్ కాలనీలో రూ.6.5 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు చైర్ పర్సన్ పావనీజంగయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించి శుభ్రం చేయాలని అన్నారు. సీసీ పనులు నాణ్యత కలిగి ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేశ్, మారుతి, వీరేందర్‌యాదవ్, బాలనర్సింహాయాదవ్, వినోద్, స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌కు సంపూర్ణ మద్దతు



కార్మిక సమ్మె గ్రామీణ బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్న ఇఫ్టూ అధ్యక్షులు షేక్ షావలి

జవహర్‌నగర్: దేశాన్ని తాకట్టు పెట్టిన బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెబుదామని దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ రషీద్, ఇఫ్టూ(ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) జాతీయ కార్యదర్శి షేక్ షావలి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు ఎండగడుతూ ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌కు భారత కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. కార్మికులు, మేధావులు, కళాకారులు గ్రామీణ బంద్‌కు మద్దతు ప్రకటించి జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో భారత ప్రగతిశీల మహిళా సంఘం ఐపీడబ్ల్యూ పెర్క సునీత, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

రామంతాపూర్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక నల్ల పోచమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ ప్రతి స్వచ్ఛంద సంస్థ పేదలకు సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. సంస్థ అధ్యక్షుడు సబ్బు పాండయ్య, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేష్, ట్రెజరర్ భువనగిరి శ్రవణ్, శ్రీనివాస్ గుప్తా, నగేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

రామంతాపూర్: ఇందిరానగర్‌లోని శ్రీరమణ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం ఎదురుగా రోడ్డుపైనే అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్‌ను ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే అక్రమ కట్టడాలు, షెడ్లను ఫిర్యాదు అందిన వెంటనే తొలగించే చర్యలు తీసుకుంటామన్నారు.

శివశంకర మహామాయి ఆలయంలో పూజలు

ఉప్పల్: ఉప్పల్ రామాలయ వీధిలోని శివశంకర మహామాయి ఆలయంలో పుష్యమాస అమావాస్య సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ సభ్యులు ఉప్పోజి బలవంత చారి, శ్రీనివాస్, పల్లెర్ల గోపి తదితరులు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రమేష్, విఠల్‌రావు, పాండుగౌడ్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ మంగాపురం శ్రీవేంకటేశ్వర ఆలయంలో నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏబీ రవీంద్రరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈ నెల 18 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. వారం రోజుల పాటు నిత్యపూజలతో పాటు శేషవాహనసేవ, శ్రీవారి విశేష లక్ష పుష్పార్చన, హంస వాహన సేవ, సూర్యప్రభ వాహనం సేవ, చంద్రప్రభ వాహన సేవ, సర్వభూపాలన సేవలతో పాటు ఈ నెల 15న శ్రీవారి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు.

ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ వీసీ, డీన్స్

మేడ్చల్‌రూరల్: పేద, మెరిట్ విద్యార్థుల కోసం మల్లారెడ్డి యూనివర్సిటీ రూ.5 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను అందిస్తోందని వీసీ వీఎస్‌కే రెడ్డి తెలిపారు. ఈ మేరకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం ప్రవేశ పరీక్ష బ్రౌచర్లను డీన్‌లతో కలిసి ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మల్లారెడ్డి యూనివర్సిటీ ఎమ్మార్‌యూసెట్-2024 గాను ఈ నెల 23, 24 తేదీల్లో అడ్మిషన్ అండ్ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్ర బోర్డులు, సెంట్రల్ బోర్డు, ఇతర గుర్తింపు పొందిన సంస్థల విద్యార్థులు, అంతర్జాతీయ విద్యార్థులు ఈనెల 22 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్య అందించాలనే భావనతో ప్రతి సంవత్సరం రూ.5 కోట్ల విలువైన 5 వేల అడ్మిషన్లకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన (ఎన్‌ఈపీ) నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ-2020 మల్లారెడ్డి యూనివర్సిటీలో అమలు చేస్తున్నామన్నారు. డీన్ రాజారెడ్డి, రిజిస్ట్రార్, హెచ్‌ఓడీ, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

దయానంద సరస్వతి జయంత్యుత్సవాలు



ఉప్పల్‌లో మాట్లాడుతున్న వేద సింధు తదితరులు

ఉప్పల్: దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలను ఉప్పల్‌లో నిర్వహించనున్నట్లు ఉప్పల్ ఆర్యసమాజం, తపస్యా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ జీవన విధానాన్ని తెలుసుకోవాలంటే వేద పఠనం చేయాలని సూచించారు. దీని వల్ల విజ్ఞానం, మనిషి జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ఉప్పల్‌లో ఆర్యసమాజం, తపస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలను ఈ నెల 9 నుంచి 12 వరకు జోషి విద్యానికేతన్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ముంబై నుంచి యజ్ఞదేవ్ జీ మహరాజ్, హరిద్వార్ డాక్టర్ కమల నారాయణ, రాయపూర్ బ్రహ్మచారి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. శుక్రవారం ప్రారంభమైన వైదిక యజ్ఞ చికిత్స శిబిరాన్ని ఆర్యసమాజ్ నిర్వాహకులు ఆచార్య వేదసింధూ ప్రారంభించారు. ఆదివారం నిర్వహించే ఊరేగింపులో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

ఉప్పల్ భగాయత్‌లో కాలభైరవ స్వామి కల్యాణం



కాల భైరవ స్వామి ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన కాల భైరవ స్వామి కల్యాణ వేడుకకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ దేవతలు ఇక్కడి ప్రజలను కాపాడతారని నమ్మకమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. ముఖ్యంగా యువత పెడదోవ పట్టకుండా వారిలో భక్తి భావన పెంపొందుతాయని గుర్తుచేశారు. ఆలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్న దేవాలయ కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న, బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు, అన్న బాలకృష్ణ, రామిరెడ్డి పాల్గొన్నారు.